మహిళామణుల ప్రత్యేక హక్కులు

# కొత్త మార్గాలు

తాళ్లూరి రామానుజస్వామి

ఆ ఉత్తరంకోసం వారం రోజులనుండి పోస్టాఫీసుకు ఉదయమూ సాయంత్రమూ విధిగా హాజరవుతూ పడికాపులు కాశాను. ఎట్లానైతేనేమి, కొసకు ఆ ఉత్తరం రానే వచ్చింది... హృదయానికి దగ్గిరగావున్న జేబులో భద్రపరిచిన ఆ ఉత్తరాన్ని మళ్లీ తీశాను. "ఆగస్టు 12వ తేదీన విజ్ఞానపురంలో జరుగనున్న మహిళా సభకు మీరు వెళ్ళండి..." అంటూ మరొకసారి చదువుకుని, సిరాతో రాయబడ్డ అక్షరాల్లోగాని, వరుసగావున్న అక్షర సముదాయాలు ఇచ్చే అర్థంలోగాని ఎంతమాత్రం దగాలేదన్న విషయాన్ని గట్టిగా ధృవపరుచుకుని, తిరిగి జేబులో భద్రంగా వుంచేశాను.

పత్రికా రచనా వృత్తి, శక్తి సామర్థ్యాలుంటే చాలా వుల్లాసంగానే వుంటుంది. కాని నాబోటివాడికి, పదేళ్లపాటు భార్యతో ఏకధాటిగా కాపురంచేసి కనీసం అరడజను మంది భావిపౌరుల వుత్పత్తికి • కారకుడైన భర్తకువలె, ఇంకా కులాసా ఏమేడుస్తుందని? అట్లా అని ఆ వృత్తిని వదిలిపెట్టుకోలేం. మరి జిహ్వకు కొత్తరుచులు చూడాలని వుంటుంది. అందుకే నావూరికి దగ్గరగానే విజ్ఞాన పురంలో దక్షిణ భారత మహిళా సభ జరుగుతుందీ అని వినేవరకల్లా ప్రాణం లేచొచ్చింది. ఎంతైనా ఆడ ప్రపంచం కదూ! మొగాళ్ళ విషయాలు రాసీరాసీ విసుగెత్తిపోయింది. కాబట్టి ఏ విధంగానైనా సరే, ఈ ఆడవాళ్ళ మహాసభకు వెళ్ళితీరాలని బుద్ధి సంకల్పించుకుంది. మా సంపాదకుని వుత్తరం అందుకు నన్ను ఆదేశించింది.

మనం ఇరవయ్యో శతాబ్దంయొక్క రెండో పడిలోకి ప్రవేశిస్తూ వున్నాం. తమకు స్వాతంత్ర్యం కావాలని భారత మహిళా లోకం గగ్గోలు పెడతూవుంది. ఒకవంక ప్రోగ్రెస్సివులంతా సై అంటే సై అంటూవున్నారు. మరొక మడిబట్టల వ్యాప్తిని ప్రచారంచేస్తున్న మహాసభవారు పట్ల ఛీ ఛీ అంటున్నారు. స్త్రీ స్వాతంత్ర్య సమస్యపట్ల పవిత్రమైన భరతఖండంలో ధర్మయుద్ధం మొదలైంది. ఇంతటి చారిత్రాత్మక ఆడవాళ్ల మహాసభకు హాజరై, వర్తమాన చరిత్ర నిర్మాణంలో భాగస్వామి కావడంకన్న మరేం కోరుతాడు ఏ పత్రికా రచయితైనా? ఆ రాత్రి బండికే విజ్ఞానపురం బయలుదేరాలి.

రాత్రి ఒకటీ ఇరవైకిగాని బండిరాలేదు. బండి స్టేషనులో ఆగడంతోనే ఎదురుగావున్న పెట్టె తలుపు గబాలున తీసి, లోపలికిదూరాను. మొత్తకుదగ్గరగానే బెంచీమీద, కాస్తఇరుకుగా వున్నప్పటికీ, నాలాంటి ఒక్క పలచటి మనిషి కూచునే వీలువుంది కాబట్టి, రఫీమంటూ కూచున్నాను. ఆతరవాత నేకన్నెత్తి డబ్బా నాలుగు మూలలా చూశాను. ఈ రోజుల్లో, అదీ స్వాతంత్ర్యం వచ్చిం తరువాత రైలు డబ్బాలు పిక్కటంగా వుండడం నిర్వివాదాంశం కాబట్టి కొత్త విషయం ఏమీ కనుపించలేదు. ఇంతలో నాకు అవతల ప్రక్కవున్న ఓ గొంతు 'ఎవరయ్యా నీవు? కళ్లవపట్టం లేదూ!' అంటూ గర్జించింది. అటు తిరిగి చూశాను. ఆడమనిషి! ముప్పై ఏళ్లు దాటి వుంటాయ్. ఆకర్షించడానికి కేవలం సౌందర్యమే వుండాలన్న అవసరాన్ని ఆమె నిరాకరిస్తున్నట్లు కనుపించింది. నా వైపుకు ఆమె వీపు ఉంది. మరోవైపుకు కాళ్లు చాచుకుని కూచుంది నేను కూచున్న చోటుతో సహా మొత్తం సగం బెంచీమీద. నేను రాకముందు ఆమె పడుకుని వుండిందన్న విషయం నాకప్పుడు తెలిసింది. ఈ కాలంలో ఇలాంటి సంఘటనలు అందరికీ సుపరిచితాలే. అయితే ప్రతి పక్షం ఆడవాళ్లుగా తటస్థించడం చాలా అరుదు. ఇలాంటి తరుణాలలో ఆడవాళ్ళతో సంఘర్షణకు దిగాలంటే మరీ ప్రమాదం.

అందుకే నేను ఎదురు జవాబివ్వకుండా ఏదో విధంగా గప్‌చుప్‌గా కూచుందామని ప్రయత్నించాను.

ఆవిడ వూరుకోలేదు, "చెబుతుంటే నీకు గాదూ!...ఆడవాళ్లు కూచున్నారన్న విషయం కూడా చూడకుండా తుర్రున దూసుకుంటూ జొరబడ్డావు కదా, ఏమనుకున్నావ్!" అంటూ గట్టిగాను, డబ్బాలో వున్నవాళ్ళందరికీ అప్పీలింగ్‌గా వుండే ధోరణిలోను అన్నదావిడ.

ఆమెతో సంభాషణలోకి దిగకుండా వుండాలని నన్ను నేను చాలావరకు తమాయించుకుంటూనే వున్నాను. వస్తుతః ఆడజాతి మగజాతి క్రింద బలాదూరే కావచ్చు; వేల సంవత్సరాల నుండి మగవాడు ఆడదానిమీద తరుగులేని పెత్తనం చెలాయిస్తూ వుండడం కూడా నిజం కావచ్చు; కాని. నాచుట్టు వుంటూ వుండిన వాతావరణమే అనండి, నన్ను పెంచిన సమాజమే ననండి, "తెగబడి" "బజారు" కెక్కిన ఆడవాళ్ళ విషయంలో నాకు విపరీతమైన అభిప్రాయాలు ఏర్పడిపోయినై. ఎంత వీరుడితోనైనా పోరాడవచ్చు గాని, "తెగబడ్డ" ఆడదానితో తగవులాటకు సిద్ధం కాకూడదని నమ్మేవాళ్ళలో నేనూ వొకణ్ణి. నాలోని ఈ(మూఢ) నమ్మకం ఆ క్షణంలో నన్ను చాలా విపరీతమైన పరిస్థితిలోనికి నెట్టేసింది. అప్పటికీ వాతావరణం ముదిరిపోయింది, డబ్బాలోని జనంసాంతం మావైపుకే చూస్తూవున్నారు. కూచున్న చోటును ఈ తరుణంలో విడిచిపెట్టడం, కనీసం నేను కాపాడుకో వలసిన పరువు ప్రతిష్ఠలదృష్ట్యా కూడా, ఎంతమాత్రమూ వల్లకాని విషయం. అప్పటికీ, ఎక్కడైనా కూచోడానికి చోటుందేమోనని, డబ్బా సాంతం కలయచూశాను. అవతలి వరసలో రెండు బెంచీలమీద ఇద్దరు సిపాయీలు పడుకుని వున్నారు. ప్రక్కనే, నిద్రమొఖాలతో నిలుచున్నవాళ్లను, ఒకళ్లపై ఒకళ్లు ఇరుకుగా కూచున్నవాళ్లను పరిశీలించింతరువాత, ఆ సిపాయీలను లేపే దమ్ములు వాళ్లెవ్వరికీ లేవన్న విషయం తెలిపోయింది. కాబట్టి నా స్థానాన్ని నేను వదిలిపెట్టకూడదన్న నిర్ణయానికే వచ్చాను.

ఈ తడవ ఆమె ఇంకా కాస్త బిగ్గరగా మొదలుపెట్టింది. "చెప్పేది నీకే!... మెల్లగా తప్పుకో, లేకపోతే పోలీసులకు రిపోర్టు చేస్తాను" అంటూ బెదిరించింది.

అంతవరకు పరధ్యానంలో వున్నట్లు నటిస్తున్న నేను ఆమెవైపుకు తిరిగి కాస్త సీరియస్‌గా చూస్తూ "ఏమిటండీ మీ బలవంతం! మీవలెనే నేనూ టిక్కెట్టు కొన్నాను...మీ ప్రక్కన చోటుంది కాబట్టి వచ్చి కూచున్నాను" అంటూ సమాధాన మిచ్చాను.

నా ధోరణి గమనించి ఆమె చాలా లాకికంగా తయారైంది. టిక్కెటు కొన్నారని ఆడవాళ్ళ దగ్గర దూరడం న్యాయమేనా?...ఇక ఆడవాళ్లకు మొగాళ్లకు తారతమ్యమే లేదన్న మాట!" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటితం చేసింది.

"లేకేం! మీకు మాకు మధ్య రేల్వేవాళ్లే తారతమ్యాన్ని స్థిరీకరించారు. మీరు దాన్ని ఉల్లంఘిస్తూ వున్నారు."

"నేనుల్లంఘిస్తున్నానా?!..."

"ముమ్మాటికీ! మీ జాతికోసం రేల్వేవాళ్లు ప్రత్యేకంగా డబ్బాలు వేశారన్న విషయం తమరు మరిచిపోయారు. చిత్తగించాలి. అప్పటికీ మీకు మగాళ్ల డబ్బాలోనే కూచోవాలనే బుద్ధివుంటే మా అందరితోపాటు సమానంగా కూచోండి. నిష్టలు పలకడానికి వీల్లేదు. పలికినా లాభంలేదు..." గబగబా అనేస్తున్నాను.

ఆమె ఇంకా లాకికంగా తయారైంది. నేను తాకకుండా వుండాలన్న వుద్దేశ్యాన్ని ప్రకటించడానికై ఆవిడ ఇంకా దగ్గరకు కుంచుకుని "అంతా మాయకాలం! బుద్ధులకొద్దీ బువ్వ అన్నారు. అందుకే ఈ ఆకలిచావులూ అనర్థాలూను" అంటూ మూతివిరుస్తూ నీతివాక్యాలు పలికింది.

"అవును! మీ రన్నట్లే అంతా మాయకాలం! ...ఈ రోజుల్లో సామాన్య ప్రజలమైన మేమంతా ముఖ్యంగా రైలు డబ్బాలలో రెండు తరహాల వ్యక్తులకు పూర్తిగా లొంగిపోతూ వున్నాం. అదుగో! అక్కడ కాళ్లు చాచుకుని పడుకునివున్న సిపాయీ భాయి మొదటి తరహావ్యక్తి. ఇక రెండోవారు మీ

వంటి శ్రీమతి. సిపాయీ భాయికి కోపంవస్తే తుపాకితో కాల్చి చంపడానికి కూడా వెనుదీయడన్న భయంవల్ల ఆయనజోలికి సాధారణంగా ప్రజలు పోరు. ఇక మీరో! మావాళ్ళ దృష్టిలో ఆయనకంటె మీరే చాలా ప్రమాద భరితులు! మేం మిమ్మల్ని అంటినా, లేక మీరే మమ్మల్ని అంటుకున్నా నేరం మా మీదికే వొరుగుతుంది! మేం మిమ్మల్ని బహిరంగంగా నిందించడమన్న సమస్యేలేదు. ఇక మీరు మమ్మల్ని నిందించారంటే తప్పంతా మామీదికే తోస్తుందే ప్రపంచం! మీరు ఇటువంటి సమయాల్లో వుపయోగించే 'శీలం' అనే ఆ మహత్తరమైన ఆయుధానికే మేమంతా మొక్కాలి! మా వాళ్లు చాలామంది మీరు ప్రయోగించడానికి అలవాటుపడ్డ ఆ ఆయుధానికి లొంగిపోతూ వచ్చారు. నేనుమాత్రం లొంగనని మీతో చెబుతూ వున్నాను. మీకు తమ శీలం విషయంలో భయం వేస్తుందంటారా, ఇదిగో మీరు నా సహోదరి అంటూ అందరి ముందూ ప్రకటిస్తూ వున్నాను. అంతేగాని ఇక్కడ కూచునే హక్కు నాకుంది. నేనీ చోటు వదల్ను'' అంటూ ఇంకా గట్టిగా సర్దుకుని కూచున్నాను.

డబ్బాలోని వాళ్ళంతా సంతోషాన్ని ప్రకటిస్తున్నట్లు కనుపించారు. ఆవిడ ఇంకా నోరెత్తే అవకాశంలేక, అటు ముఖం త్రిప్పుకుని కూచుంది. ఒక గండాన్ని గడిచి విజయవంతంగా గట్టెక్కినందుకు లోలోపల గర్విస్తూ కూచున్నాను.

మా ఇద్దరిలో ఏర్పడిన ప్రతిష్టంభన తెల్లవారు ఝామువరకు అలానే వుండి పోయింది. అప్పటికే బండి చాలా స్టేషన్లు దాటిపోయింది. డబ్బాలోని పాతముఖాలు చాలావరకు దిగిపోయినై. కొత్తవ్యక్తులు ఎక్కుతూవున్నారు. దాంతోపాటు మాలో ఏర్పడ్డ ప్రతిష్టంభన డిగ్రీలు కూడా దిగజారుతూ వచ్చాయి.

ప్రొద్దు కరకర పొడుస్తూవుంది, ఆమె లేచి అటుకుమీదనున్న తోలుసంచి తీసి బెంచీమీద పెట్టి విప్పుతూవుంది. సజావుగా కనిపిస్తున్నది తోలుసంచి. ఏవో చిల్లర మల్లర కాగితాలతో పాటు ఇంగ్లీషు పుస్తకాలు గూడా వున్నాయ్. రెండు పళ్ళ పుల్లలుతీసి ఒకటి నాకు అందిస్తూ ''తీసుకుంటారా'' అంటూ అడిగింది. థాంక్స్ అని అట్టే తీసుకున్నాను. నోట్లోపెట్టి నములడం ప్రారంభించాను. తోలు సంచిని సర్ది పైన బెట్టి ఆమె కూడా పళ్ళ పుల్లను నమలడం ప్రారంభించింది.

''వచ్చే స్టేషనులో నేను దిగిపోతాను''అంది ఆమె.

నాకు కొస్త ఆశ్చర్యం వేసింది. ''మీరు విజ్ఞాన పురంలో దిగుతారన్న మాట''అన్నాను.

''అవునండీ! మీరూ అక్కడికే లాగుందే'' అడిగింది ఆమె.

''అవును'' అంటూ తలూపాను. విజ్ఞాన పురానికి ఆమెకూడా వెళ్లుతుందన్న విషయం మీద నేనింకా ఆలోచించడం మొదలుపెట్టాను. మహిళా మహాసభ మెరుపులా నా బుర్రలో వెలిసింది. ఆమె కూడా మహిళాసభకు పోతూ వుండవచ్చునన్న వూహ నన్ను మరీ చికాకు పరిచింది. వెంటనేఅడిగాను డొంక తిరుగుడుగా—

''బంధుమార్గం బయలు దేరారా?''

''లేదండీ! ... మహిళా సభ వార్షికోత్సవంలో పాల్గొనడానికి పోతున్నాను'' అంది.

కొంపతీసి నా వూహ నిజమే అయింది ... ఇందాకటినుండి నాలో వుంటూ వుండిన విజయగర్వం ఇప్పుడు ఎదురు తిరిగింది... ఈమె మహిళాసభలో నాపైన ఎంత దుమ్మెత్తి పోస్తుందో, నా ఉదంతాన్ని ఆధారంగా తీసుకుని మగ మృగాల కర్కశత్వంపై ఎంతటి ఘాటైన ఉపన్యాసం చేస్తుందోనని నాకు భయం వేసినమాట వాస్తవం.

విజ్ఞాన పురం స్టేషను ఒంటిరెక్క దాటి పోయింది. ఆమెలేచి సామాను సర్దుకుంటూ వుంది. నేనుకూడా పైనున్న బెడ్డింగుతీసి బెంచీమీద పెట్టాను. స్టేషనులో బండి ఆగింది. పరస్పర సహకారంతో సామానులను క్రిందికి దించుకున్నాం. నేను కూలివాడికోసం వెతుకుతూవున్నాను. ఇంతలో మహిళా సభ తాలూకు లేడీ వాలంటీర్లు ఆమెను సమీపించి, స్వాగతం చెప్పి ఆమె బాపతు సామాను తీసుకున్నారు. పోయేముందు ఆమె నన్ను పలకరించింది—

"మీరెక్కడికి వెళ్ళాలి?"

"నేను మహిళా సభకే రావాలి?" అన్నాను కాస్త నెమ్మదిగా.

"మీరా! ... మీకేంపని?" ఆశ్చర్యంగా అడిగింది.

"నేను పత్రికా ప్రతినిధిని. మా పత్రిక వాళ్లు నన్ను ఇక్కడికి పంపారు" ఉన్న విషయం చెప్పాను.

ఆమె నివ్వెరపోయింది. తృటిపాటు ఆలోచనలో మునిగి, తెప్పరిల్లుకుని "మొదటే చెప్పలేదేం?" అని మాత్రం అన్నది.

లేడీ వాలంటీర్ల వైపుకు తిరిగి "పత్రికా విలేఖరులకు ప్రత్యేకంగా బస వుందా?" అని అడిగింది. వాళ్ళు వుందన్నారు.

నా బెడ్డింగు కూడా లేడీ వాలంటీర్లు నెత్తికెక్కింది.

మేమిద్దరం మౌనంగా నడుస్తూ వెళ్ళాం. ఏవో గాలి, వాతావరణం, ఆప్రదేశానికి సంబంధించిన ఎందుకూ పనికిరాని మాటలు తప్ప సీరియస్ గా వుండే ఏ విషయమూ మేము మాట్లాడుకోలేదు. బస చేరుకున్నాం. "చిత్రగుప్త" లకై ఏర్పాటు చేయబడివున్న బసలో నన్ను వదిలి "మహాసభలో కలుసుకుందాం" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

బసలోవున్న పత్రికా ప్రతినిధుల్లో చాలామంది తెలిసిన మిత్రులే వున్నారు. మా అందరి సంఖ్య బాగానే పెరిగింది.

"స్వాతంత్ర్యం వచ్చింతరువాత మన పత్రికలవాళ్లంతా స్త్రీస్వాతంత్ర్య సమస్యకు ప్రాముఖ్యం ఇస్తున్నారనడానికి మనందరి సంఖ్యే ప్రబల నిదర్శనం" అన్నాడొకడు.

మరొకడు ఇంకా దూరం పోయాడు.

"అప్పుడే తొందరపడి ఆ నిర్ణయానికి రాకూడదు. మనమధ్య ఒకరో ఇద్దరో మహిళామణులు కూడా వున్ననాడు ఆమాట చెప్పుకోవాలి" అన్నాడు.

మావాళ్ల కోతల్లో నేనంతగా పాల్గొనలేకపోయాను. రాత్రి రైలు డబ్బాలోని సంఘటన ఇంకా నన్ను వేధిస్తూనేవుంది. ఆమె మహాసభలో నన్నుగురించి ఏమంటుందో నన్న భయంకూడా నన్ను బాధిస్తూనేవుంది.

పది గంటలకు మహిళాసభ ప్రారంభమైంది. వేదిక దగ్గరనేవున్న ప్రదేశంలో మేము కూర్చున్నాం. మావాళ్లంతా మహాసభకు విచ్చేసిన స్త్రీజన సందోహంమీద నాలుగు మూలలా చూపులు విసిరేస్తూ మహోల్లాసంగా వున్నారు. నేనుకూడా వాళ్ళందరివైపు చూశాను. అయితే నా ధ్యాస అంతా వేదికమీదనే వుంది. రాత్రి రైలు డబ్బాలో నాతో కీచులాటకు దిగి ఓడిపోయిన ఆడమనిషి వేదికమీదనే వుంది. అక్కడవున్న వాతావరణాన్నిబట్టి ఆమె కొంత ముఖ్యురాలుగానే కనుపిస్తూవుంది. అప్పుడప్పుడు ఆమె నా వైపుకు కూడా చూస్తూనేవుంది. అయితే ఉదయం రైలు పెట్టెలోను, ప్లాటుఫారం మీదను ఆమె వదనంలో కనుపించిన మందహాసం నాకిప్పుడు కనుపించడం లేదు. ఆమె వాలకం నన్నింకా ఆందోళనలోనికి ముంచేసింది.

ఒంటి గంటవరకు మహాసభ నడిచింది. ఓం ప్రథమంగా, చచ్చి స్వర్గం చేరుకున్న జాతీయ అంతర్జాతీయ విఖ్యాతులగు ఆడ మగవాళ్ళందరికీ మహాసభవారు తర్పణాలు వదిలారు. తరువాత దేశంలోని ఆహార సమస్య పట్ల స్త్రీల కర్తవ్య విషయంలో తీర్మానం వచ్చింది. ఊరికదంపుడు వాళ్ళందరికీ ఈ తీర్మానం కావలసినంత ఆహారం పెట్టింది. ముఖ్య మంత్రి భార్య మొదలుకొని రెవెన్యూ ఇన్స్పెక్టరు సతీమణి వరకు ఆహార సమస్య విషయంలో గర్జోలు పడ్డారు.

సాయంత్రం తిరిగి రెండుగంటలకే ప్రారంభమైంది సభ. స్త్రీల సమస్యలకు సంబంధించిన చాలా విషయాలు చర్చకు వచ్చాయి. అటో ఇటో తీర్మానాలన్నీ మహాసభవారు ఆమోదించారు.

తరువాత స్త్రీ స్వాతంత్ర్యాన్ని బలపరుస్తూ ఒక తీర్మానం తీసుకురాబడింది. ప్రతిపాదించడము, బలపరచడము రెండూ జరిగిపోయినై. అంతవరకు ఏ తీర్మానం మీదకూడా మాట్లాడని ఆవిడ మైక్ వద్దకు వచ్చి ఈ తీర్మానం మీద మాట్లాడడానికి పూనుకుంది. ఆక్షణంలో ఆమె వైపుకు చూడాలంటే భయం వేసింది.

పెన్సిలు సిద్ధంగా పెట్టుకుని తలవంచుకున్నాను. ఆమె మొదలు పెట్టింది:

"మనదేశానికి స్వాతంత్ర్యం లభించినమాటే యథార్థమైతే ఈ తీర్మానంయొక్క అవసరం ఎంతమాత్రమూ లేదని నాఅభిప్రాయం. కాబట్టి దీన్ని ఉపసంహరించుకోవాలని ప్రతిపాదకు రాల్ని కోరుతాను" అంటూ ప్రారంభించింది.

సభవాళ్ళంతా నిశ్శబ్దంగాను, ఆశ్చర్యంతోను అది వింటూ వున్నారు.

ఆమె ఇంకా ఇలా అంది:

"ఈ తీర్మానాన్ని మహాసభవారు అంగీక రించడమే జరుగుతే, రైలు డబ్బాలలో స్త్రీల కోసం ప్రత్యేక డబ్బాల ఏర్పాటును బలపరిచి నంత అవివేకం కాగలదని నా వూహ. ఈ దేశం లోని మగవాళ్లతోపాటు ఆడవాళ్ళకు కూడా స్వాతంత్ర్యందొరికింది. కాబట్టే స్త్రీసాతంత్ర్యం అంటూ ఒక ప్రత్యేక సమస్య లేనేలేదు. ఇక పోతే దొరికిన స్వాతంత్ర్యాన్ని ఎలా వినియో గించుకోవడమన్నదే మనం ఆలోచించుకోవాలి. మనలో కొందరు దొరికిన స్వాతంత్ర్యాన్ని అద నుగా తీసుకుని సంఘంలో పురుషులకంటె ఎక్కువగా అవకాశాల్ని అనుభవించడానికి పూనుకుంటూ వున్నారు. కొన్ని సందర్భాలలో, స్త్రీలు, సమాజంలో తమ పెత్తనం నిలుపు కోవడానికి "శీలం" అనే అయుధాన్ని కూడా వుపయోగించి, పురుషుల్ని లొంగదీస్తూ వున్నారు. ఇది జరగకుండా చూడాలి."

మగవాళ్ళ దౌర్జన్యాలను గురించి ఎంత గట్టిగా చెప్పగలుగుతే అంత బాగా ఆనందించే వాళ్ళ సంఖ్య మహాసభలో ఎక్కువగా వుంది. కాబట్టి ఆమె ఉపన్యాసం చాలామందికి నచ్చ లేదు. బహు కొద్దిమంది ఆమెను అభినందించారు. బిగ్గరగా కాకపోయినా, అందరికన్న గట్టిగా అభినందించింది నేనే నన్న విషయం ప్రత్యే కంగా చెప్పుకోనవసరం లేదు.

మహాసభ ముగిసిపోయింది. ఆరాత్రిబండికే తిరిగి మేము బయలుదేరాం. బయలుదేరేముందు ఆవిడ మా బసకువచ్చి నన్ను కలుసుకుంది. చాలా వుల్లాసంగా కనుపించింది ఆమె. అంత కంటె ఎక్కువ వుత్సాహం నాలో పరుగు లెత్తింది.

"చాలా బావుంది మీ వుపన్యాసం" అన్నాను.

"మీకు నచ్చిందా?..." అంటూ నవ్విం దామె.

"మిమ్మల్ని పొగడాల్సిన అవసరం నాకు బొత్తుగాలేదు. నూటికి నూరుపాళ్ళు యథార్థం చెప్పారు. హృదయపూర్వకంగా అభినందిస్తు న్నాను."

"నేనే మిమ్మల్ని అభినందించాలి" అన్న దామె. ఎందు కంటున్నదో తెలిసి కూడా "కారణం?" అన్నాను. నా వుపన్యాసానికి రాత్రి మీతో సంభవించిన సంఘటనే కారణం. దాన్ని తలుచుకుంటే నా కిప్పటికీ సిగ్గుగానే వుంది" అన్నది కాస్త సీరియస్‌గా.

స్టేషను చేరుకుని సిద్ధంగావున్న బండెక్కాం. ఒకే డబ్బాలో, ఒకే బెంచీమీద, ఎలాంటితార తమ్యమూ లేకుండా కూచుని ప్రయాణం చేశాం.

సాయంత్రం యింటికి రాగానే భార్యతో అన్నాడతడు: "రాత్రికి ఓ స్నేహితుణ్ణి భోజనానికి పిలిచాను." ఆ మాట విని భార్య కోపంగా అంది: "పిలుస్తారు, మీకేం! సాయంత్రం పనిమనిషి రాలేదు, చంటిదాని కింకా జ్వరం తగ్గనేలేదు; నాకా నిన్నటినించీ నడుంనొప్పి; పాతబాకీ తీరుస్తేగాని కూరలవాడు యింక అరువివ్వనన్నాడు–"

మధ్యలో అడ్డం ఒచ్చి భర్త అన్నాడు: "నాకన్నీ తెలుసు. అందుకే వాణ్ణే భోజనానికి పిలిచాను. వాడంటే నాకభిమానం కాబట్టీ, ఆ గాడిద పెళ్ళి చేసుకుందామని ఉబలాట పడుతున్నాడు కాబట్టీ వాడికివన్నీ తెలియచెయ్యడం ఎందుకైనా మంచిదని, యివాళే రమ్మన్నాను."